కామెడీ కథ

# క్విజ్ కాంటెస్ట్

ఆఫీసులో సీరియస్‌గా అకౌంట్స్ చూసుకుంటున్న నాకు ' కిషోర్ గారూ!'' అన్న పిలుపు వినబడి తలత్రిప్పి చూశాను. నా పక్క సీటులోని పరాంకుశం మెరిసే కళ్లతో ''టీవీలో 'శ్యాంసుందర్' టీ.వీ కంపెనీ వాళ్ళు కండక్ట్ చేస్తున్న 'క్విజ్ కాంటెస్ట్' మొదలయ్యిందండీ! దానికి మనం చెయ్యవలసిందల్లా రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు టీవీలో ప్రసారమయ్యే కార్యక్రమాలను క్రమం తప్పకుండ చూస్తూ వాళ్లడిగిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాసి పంపడమే.

మొదటి బహుమతి పదివేల రూపాయలు, రెండవ బహుమతి ఐదువేలు, మూడవ బహుమతి మూడువేల రూపాయలు. చాలా ఈజీ కదండీ. కాలక్షేపానికి కాలక్షేపం డబ్బుకి డబ్బు. ఏమంటారు? ఈరోజే ప్రారంభమౌతోంది 'శ్యాంసుందర్ టీవీ వాళ్ల క్విజ్‌కాంటెస్ట్'' అంటూ టీవీ యాంకర్ల స్టయిల్లో గుక్కతిప్పుకోకుండా, చిత్రవిచిత్రంగా చేతులూపుతూ, రకరకాల హావభావాలతో 'చాలా' ఇంట్రస్టింగ్‌గా చెప్పాడు.

ఇక నా ఆనందానికి అంతులేదు. ఇంటికెళ్లగానే ఈ విషయం నా శ్రీమతి చెవిన వేయాలి.

లంచ్ అవర్‌లో స్టాఫంతా టీవీలో రాబోయే 'క్విజ్ కాంటెస్ట్' గురించే మాట్లాడుకుంటున్నారు. ఒక్కొక్కళ్ళు ప్రైజొస్తే తాము డబ్బుని ఏమి చెయ్యబోతున్నదీ చర్చించుకుంటున్నారు.

''మీకు మొదటి బహుమతి వస్తే మీరేం చేస్తారు'' అని పరాంకుశాన్ని అడిగాను.

''మా ఇంట్లో మా ఆవిడ ఎంత చెప్తే అంత. పెళ్లయిన దగ్గర్నుండి నాకంటూ ఒక సొంత అభిప్రాయం ఎక్కడేడ్చింది'' అంటూ వాపోయాడు.

''ఇంతకీ నువ్వేం చేస్తావా పదివేలు?'' అని అడిగాడు.

'' మా అబ్బాయి అఖిల్ పేరు మీద ఫిక్స్‌డ్ వేస్తాను'' అన్నాను.

''మరి రెండో బహుమతో లేక మూడవ బహుమతో వస్తే...''

''ఎలాగూ దీపావళి పండుగొస్తోందిగా? ఇంటిల్లిపాదీ బట్టలు కొనుక్కుంటాం'' అన్నాను.

సో, డబ్బొస్తే ఏం చెయ్యాలనేది డిసైడైపోయింది. కాబట్టి ఇక క్విజ్‌లో పాల్గొనడమే తరువాయి అనుకున్నాను తృప్తిగా.

ఇల్లు చేరగానే నా శ్రీమతి రాధిక కళకళ్లాడుతూ ఎదురొచ్చింది. ''రాధీ! నీకో గుడ్‌న్యూస్!'' అని అన్నానో లేదో, ''ఏమండీ! మీక్కూడా ఓ గుడ్ న్యూస్'' అంది.

''సరే, ఏమిటో చెప్పు'' అన్నాను హుషారుగా.

''ముందు మీరే గుడ్‌న్యూసన్నారుగా! కాబట్టి మీరే ముందు చెప్పండి''

''అలా కాదు, లేడీస్ ఫస్ట్''

''సరే అయితే. ఈరోజు టీవీలో 'శ్యాంసుందర్' కలర్ టీవీ కంపెనీ వాళ్ళు 'క్విజ్ కాంటెస్ట్' ప్రారంభమౌతోంది. ప్రయిజ్ గెలుచుకోవాలంటే మనం చెయ్యవలసిందల్లా...'' అంటూ తను చెప్తూంటే ''రాత్రి ఏడునుంచి తొమ్మిదిగంటల వరకు ప్రసారమయ్యే టీవీ కార్యక్రమాలు క్రమం తప్పకుండా చూస్తూ వాళ్ళడిగిన ప్రశ్నలకు సమాధానాలు పోస్ట్ కార్డులో పంపడం '' అంటూ పూర్తి చేసాను.

''అరె! మీక్కూడా తెలిసిందా! ఎదురింటి వనజ ఇందాకే ఈ విషయం చెప్పింది. 'అఖిల్' గాడి చదువులో పడి మనమీమధ్య టీవీ చూడ్డమే మానేసాము. నాకు వనజ, మీకు మీ కొలీగ్స్ ఈ విషయం చెప్పకపోతే అనవసరంగా ఈ 'క్విజ్ కాంటెస్ట్' మిస్సయ్యేవాళ్లం కదండీ. అయ్యయ్యో! అప్పుడే టైం ఆరయిపోయిందండీ! గబగబా వంట చేసెయ్యాలి. ఈలోపు మీరు అఖిల్ చేత హోంవర్క్ చేయించండి. ఏడింటికల్లా టీవీ ముందుండాలి మనం'' అంటూ వంటింట్లోకి పరుగుతీసింది.

''ఒరేయ్ కిషోర్!'' అన్న మా అమ్మ పిలుపువిని ఆమె గదిలోకి వెళ్లాను.

''ఏంటమ్మా?'' అని అడిగాను.

''ఏరా! నేను కూడా ఆ పోటీలో పాల్గొనవచ్చా''

''ఓ! నిరభ్యంతరంగా! ఎన్నెక్కువ కార్డులు పంపితే అంత మంచిది. ఏమో! నీ అదృష్టం బాగుండి నీకే ఆ బహుమతి రావచ్చు.''

''అయితే, ఈ మంచం టీవీ రూములో పెట్టరా. నేను కూర్చుని చూడలేనుగా. హాయిగా పడుకుని టీవీ చూస్తాను'' అంది అమ్మ. దాంతో అమ్మ మంచం టీవీ రూమ్‌కి షిఫ్ట్ అయిపోయింది.

గడియారం ఏడు గంటలు కొట్టడంతో ఎక్కడి వారక్కడ పనులన్నీ వదులుకుని టీవీ ముందు వాలిపోయాము.

''కొద్ది క్షణాల్లో 'ఇంద్రలోకం' సీరియల్'' అంటూ టీవీ స్క్రీన్‌పై అక్షరాలు ప్రత్యక్షమయ్యాయి. కన్నార్పకుండా ఆ సీరియల్ చూసాక, 'కథంటే ఇదే' సీరియల్, 'పదనిసలు', 'అంతర్మథనం' సీరియల్ ప్రసారమయ్యాయి. దాంతో గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. 'క్విజ్ కాంటెస్ట్'లో ఏ ప్రశ్న వెయ్యబోతారో అనుకుంటూ అందరం ఊపిరిబిగపట్టి చూస్తున్నాము. టీవీ స్క్రీన్‌పై యాంకర్ ప్రత్యక్షమై, 'శ్యాంసుందర్' కలర్ టీవీ వాళ్ళ 'క్విజ్ కాంటెస్ట్'కు స్వాగతం. మీరంతా ఏడుగంటల నుంచి తొమ్మిది గంటల వరకు ప్రసారమైన మా కార్యక్రమాలను చూసి 'బాగా' ఎంజాయ్ చేసారు కదా! ఇప్పుడు మేమడగబోయే ప్రశ్న...'పదనిసలు' కార్యక్రమంలోని యాంకర్ చాముండి కట్టిన చీరలో ఎన్ని ఆకులు, ఎన్ని పూవులున్నాయో కరెక్ట్‌గా సమాధానం వ్రాసి వారంలోగా మాకు పంపండి'' అంటూ ముప్పై రెండు పళ్ళు కనబడేలా నవ్వుతూ సెలవు తీసుకుంది.

నేను రాధిక వంక చూసాను, ఇది చీరలకు సంబంధించిన ప్రశ్న కాబట్టి దీనికి సమాధానం నువ్వే చెప్పాలి సుమా అన్నట్లుగా.


''ఏమోనండీ! నేను లెక్క పెట్టలేదు'' అంది అపరాధిలా తలొంచుకుని.

నాకు ఒళ్ళు మండిపోయింది.

''పక్కింటి పంకజం, ఎదురింటి వనజ ఏయే చీరలు కట్టుకున్నారో గమనించి ఆ చీరలు కొనేవరకు నా ప్రాణం తీస్తావుగా! 'చాముండి' కట్టిన చీరలో ఆకులెన్నో, పువ్వులెన్నో ఎందుకు లెక్కపెట్టలేదు'' అని అరిచి మా అమ్మ వంక చూస్తూ, ''ఏమ్మా! నువ్వన్నా లెక్క పెట్టావా?'' అని అడిగాను.

''ఏమోరా! నాకసలే కళ్ళు సరిగ్గా కనబడి చావదు. ఎదురుగా వచ్చే మనుష్యుల్నే సరిగ్గా గుర్తుపట్టలేను అలాంటిది చీరలో ఆకేదో, పువ్వేదో ఎలా గుర్తుపట్టగలను!'' అంది దిగులుగా. నాకు ఒక్కసారిగా నీరసం ఆవరించింది. రెండు గంటలపాటు 'కష్టపడి' టీవీ చూసినందుకు ఏ మాత్రం ప్రయోజనం లేకుండాపోయింది.

మరుసటిరోజు కూడా యథాప్రకారం పనులన్నీ మానుకుని టీవీ ముందు ఏడింటికల్లా ప్రత్యక్షమయ్యాము. మా ఆవిడ ఒక పేపరు, పెన్ను పట్టుకుని



టీవీ చూస్తూ ఏదో నోట్ చేసుకుంటోంది.

''ఏంటి రాధీ! ఏం నోట్ చేసుకుంటున్నావు'' అని అడిగాను కుతూహలంగా

''ఒక్కొక్క స్త్రీ పాత్ర కట్టిన చీరలో ఏయే డిజైన్లు ఉన్నాయో నోట్ చేసుకొంటున్నానండీ'' అంది.

మా ఆవిడ తెలివికి నాకు ముచ్చటేసింది. ఇక తొమ్మిది గంటలవుతోందనగా టీవీ స్క్రీన్‌పై ఆ యాంకర్ ప్రత్యక్షమై, 'క్విజ్ కంటెస్ట్'కు స్వాగతం. ఈరోజు ప్రశ్న 'అందవికారం' సీరియల్‌లో 'రంజిల్' వేసుకున్న షర్ట్‌లో చారలెన్నున్నాయో కరెక్టుగా వ్రాసి ఈ క్రింది అడ్రస్‌కి పంపండి'' అంటూ మళ్లీ తన స్టయిల్లో నవ్వి మాయమైంది.

నేను రాధిక వంక చూసాను. ''ఇది మీ మగాళ్ల షర్టులకు సంబంధించిన ప్రశ్న. నిన్న తెగ నీలిగారుగా. ఇప్పుడు చెప్పండి. ఆ షర్ట్‌లో ఎన్ని చారలున్నాయో'' అంది.

నేను నీళ్లు నమలసాగాను. ఇది నేను ఊహించని ప్రశ్న. అనవసనరంగా నిన్న తొందరపడి రాధికను తిట్టి ఈరోజిలా ఇరుక్కుపోయానే అని బాధపడ్డాను.

''అదీ...సారీ రాధీ! నిన్న అనవసరంగా తొందరపడి నిన్ను తిట్టాను'' క్షమించమన్నట్లుగా చేతులు పట్టుకున్నాను.

''పోన్లెండి! రేపట్నుంచి మీక్కూడా పేపరు, పెన్ను ఇస్తాను. మీరు కూడా అన్నీ నోట్ చేస్తుండండి'' అంది. సో, ఈరోజు కూడా రెండు గంటలు వేస్టయిపోయాయన్నమాట. రేపయినా అన్ని విషయాలను జాగ్రత్తగా గమనించాలని అనుకున్నాము.

మర్నాడు నేను, రాధిక, అఖిల్ (సీరియల్‌లో పిల్లల పాత్రలు కూడా ఉంటాయి మరి) చేతుల్లో పేపర్లు, పెన్నులు పెట్టుకుక్కూర్చున్నాం. యథావిధిగా తొమ్మిదింటికి యాంకర్ నవ్వుతూ ప్రత్యక్షమైంది, మేము కూడా చాలా ధీమాగా కూర్చున్నాం. ఆమె డ్రస్సులకు సంబంధించి ఏ ప్రశ్నడిగినా మా వద్ద సమాధానాలున్నాయి మరి.

''ఇక ఈరోజు ప్రశ్న. డ్రస్సులకు సంబంధించిన ప్రశ్న వేస్తామనుకుంటున్నారు కదూ! హి హి హి!. అయితే మీరు పప్పులో కాలేసారన్నమాటే. ఈరోజు మేమడగబోయే ప్రశ్న 'ఇంద్రలోకం' సీరియల్‌లో పరంధామయ్యగారు అమెరికా నుండి వస్తున్న తన కొడుకు కోసం ఎదురుచూస్తూ వీధిలోకి, ఇంట్లోకి ఎన్ని సార్లు పచార్లు చేశారు? వారంలోగా మీ సమాధానం పంపండి'' అంటూ పళ్లికిలించి మాయమైంది. నాకు నోటమాట రాలేదు.

''ఏమండీ! ఓ పని చేస్తే...'' అంటూ ఆగింది రాధిక. ఏమిటన్నట్లు చూసాను. ''పరంధామయ్యగారు ఒక ముసలిపాత్ర. మహా అయితే మూడు నుంచి ఆరుసార్లు ఇంట్లోకి వీధిలోకి తిరిగుంటాడు. మనమెలాగూ నలుగురమున్నాం కాబట్టి నేను వ్రాసినట్టుగా మూడుసార్లు, మీరు నాలుగుసార్లు తిరిగాడని రాసినట్టు, అఖిల్ ఐదుసార్లు, అత్తయ్య ఆరుసార్లు ఆ పరంధామయ్య పచార్లు చేసినట్లు నాలుగు కార్డుల్లో వ్రాసి పంపేద్దాం. వాటిలో ఏది కరెక్టయినా మనకు ప్రయిజ్ వచ్చే ఛాన్సుంది'' అని రాధిక అనేసరికి ''అవున్రా కిషోర్! రాధిక చెప్పినట్లు చేద్దాం'' అంది అమ్మ. శ్రీమతి తెలివికి మెచ్చుకోకుండా వుండలేకపోయాను.

ఇలాగే మరో నాలుగు రోజులు ఆ యాంకర్ అడిగిన ఒక్కొక్క ప్రశ్నకు మాకు తోచిన నాలుగు సమాధానాలు నాలుగు కార్డుల్లో పంపేసాము.

**మేఘన**

ఇక 'క్విజ్‌కాంటెస్ట్' ఫలితాలు తెలిసే రోజు రానే వచ్చింది. 'టూత్‌పేస్ట్' అడ్వర్‌టైజ్‌మెంట్‌లోలా పళ్లన్నీ బయటపడేలా నవ్వే ఆ యాంకరే టీవీ స్క్రీన్‌పై ప్రత్యక్షమై, ''ఇప్పుడు ఒక ప్రముఖ హీరో కరెక్ట్‌గా సమాధానాలు వ్రాసిన వారినుంచి లక్కీడిప్ ద్వారా కొందరిని ఎంపిక చేస్తారు. మేము మొదటిగా అడిగిన ప్రశ్న 'చాముండి చీరలో పువ్వులు, ఆకులు ఎన్నెన్ని వున్నాయి?' దీనికి కరెక్ట్ సమాధానం ఇరవై ఆకులు, ముప్పై పువ్వులు. ఇప్పుడు హీరోగారు ముగ్గురు విజేతల్ని ఎంపిక చేస్తారు. వెంటనే టీవీ స్క్రీన్‌పై గుట్టగా పోసివున్న పోస్ట్‌కార్డులు వాటి పక్కన ఆ హీరో ప్రత్యక్షమయ్యారు. హీరోగారు స్టయిల్‌గా ఒక చేత్తో క్రాఫ్‌ని సవరించుకుంటూ మరో చేత్తో 'శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని చిటికెన వ్రేలుతో ఎత్తినట్టు'గా ఉత్తరాలను కలపడానికి ప్రయత్నించి బ్యాలెన్స్ తప్పి వాటిమీద బోర్లాపడిపోయాడు. నెమ్మదిగా ఆ కార్డుల మీద నుంచి లేచి ఇక లాభం లేదనుకుని రెండు చేతుల్తో వాటిని కలుపుతూ ఆయాసపడుతుంటే ఆ యాంకర్ ముసిముసి నవ్వులు నవ్వుతూ కలపడంలో హెల్ప్ చేసింది.

''ఫస్ట్ ప్రయిజ్ గెలుచుకున్నవారు పంకజం'' అంటూ ఇంకా ఏదో ఆమె చెప్తుండగానే 'ధన్'మన్న శబ్దం వినబడి ప్రక్కకు తిరిగి చూసాను. నా శ్రీమతి స్పృహ తప్పి పడుంది. అఖిల్ చేత నీళ్ళు తెప్పించి రాధికపై చల్లాను. తను లేస్తూనే ''ప్రక్కింటి పంకజానికి ప్రయిజ్ వచ్చిందాండీ'' అనడిగింది.

''ప్రయిజొచ్చింది గుడివాడలోని పంకజానికట. పూర్తిగా వినకుండానే నువ్వు పడిపోయావు'' అన్నాను లేపుతూ. ''పోన్లెండి. మనకు రాకపోయినా ఫరవాలేదుగాని ప్రక్కింటి వాళ్లకు ప్రయిజొస్తే అంతకుమించిన అవమానం మరొకటి లేదు'' అంది ఊపిరి పీల్చుకుంటూ.

''ఇక రెండవ బహుమతి గెలుచుకున్నవారు కిషోర్ కుమార్'' అని యాంకర్ అనౌన్స్ చెయ్యగానే నేను ముద్దగా తడిసిపోయాను.

''సారీ డాడీ! కిషోర్‌కుమార్ అనగానే నువ్వేననుకుని నువ్వెక్కడ పడిపోతావోనని నీ మొహాన నీళ్ళు కొట్టాను'' అన్నాడు పుత్రరత్నం పశ్చాత్తాపపడుతూ. మాకెవ్వరికీ మూడవ బహుమతి కూడా రాలేదు.

''ఇక తరువాతి ప్రశ్న. 'ఏ'పంటే ఇదే' సీరియల్ మూడు వందల ఎపిసోడ్‌లో సూర్యకాంతం రమణారెడ్డిని 'మీరు కాస్త నోరుమూస్తారా' అని ఎన్నిసార్లు అంది. దీనికి సమాధానం 'పది' సార్లు. ఇప్పుడు హీరోగారు విజేతల్ని ఎంపిక చేస్తారు'' అంటూ హీరోగారి వంక చూసిందా యాంకర్. ''అయ్యయ్యో! మనం తొమ్మిదిసార్లని వ్రాశాం కదండీ! కొద్దిలో తప్పిపోయిందే'' అంటూ బాధపడింది నా శ్రీమతి.

ఇలాగే మరికొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పి కార్డులను కష్టపడి హీరో చేత కలిపించి విజేతల్ని అనౌన్స్ చేసింది యాంకర్. ఇంతవరకు మాకు కనీసం మూడవ బహుమతి కూడా రాలేదు.

''ఇక ఆఖరి ప్రశ్న' అని వినబడగానే మేమంతా ఉత్కంఠతతో టీవీపై దృష్టి సారించాము. 'అంతర్మథనం' సీరియల్‌లో హీరోయిన్ 'శోకిని' ఏడుస్తూ ఎన్నిసార్లు ముక్కు చీదింది. దీనికి సరైన సమాధానం 'ఏడు' సార్లు. లక్కీడిప్ ద్వారా హీరోగారు విజేతల్ని ఎంపికచేస్తారు'' అని యాంకర్ మాయమవగానే ఒక పెద్ద కొండలాగా కుప్పగా పోసివున్న కార్డులు టీవీ స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యింది. వెంటనే 'ధన్'మన్న శబ్దం వినబడింది. మాలో ఎవరన్నా పడిపోయారేమోనని ఒకరినొకరం చూసుకున్నాం. ''అమ్మయ్య! అందరం బాగానే ఉన్నాం'' అనుకుని టీవీ వైపు దృష్టి మరల్చాము. మూర్ఛబోయిన హీరోగారి మొహాన నీళ్లు చల్లి లేపడానికి ప్రయత్నిస్తోంది యాంకర్. అతను 'ఫిట్స్' వచ్చినవాడిలా-''నేనీ కొండను కలపలేను. నన్ను బలవంతపెట్టకండి. దీన్ని కదిలించానంటే సజీవ సమాధవడం ఖాయం!'' అంటూ కొట్టుకుంటున్నాడు!

''ప్రేక్షకులు మన్నించాలి. హీరోగారి పరిస్థితి బాగులేనందున ఈ ప్రశ్నను 'క్యాన్సిల్' చేస్తున్నామని తెలియజేయడానికి చింతిస్తున్నాం'' అంటూ యాంకర్ దీనంగా మొహం పెట్టింది.

''ఏంటండీ! ఇలా జరిగింది! దీనికి మనం కరెక్ట్‌గా సమాధానం వ్రాసినా ప్రయోజనం లేకుండా పోయిందే'' అంటూ వాపోయింది రాధిక.

''ఏం చేస్తాం రాధీ! విధి ఆడే నాటకంలో మనమంతా పావులం. మనచేతిలో ఏముంది చెప్పు'' అంటూ భారంగా నిట్టూర్చాను.

'క్విజ్ కాంటెస్ట్' పుణ్యమా అని మాకు 'ప్రయిజులు' రాకపోయినా టీవీ కార్యక్రమాలను 'ఉణ్ణంగా' పరిశీలిస్తూ చిన్నచిన్న విషయాలను కూడా వదలకుండా క్రమం తప్పకుండా చూడ్డం మాకలవాటైపోయింది. రాత్రి ఏడుగంటలయ్యిందంటే చాలు మేమంతా టీవీకి అతుక్కుపోయి తొమ్మిదింటికి టీ.వీ ముందు నుంచి లేస్తున్నాం. అంతగా టీవీ ఎడిక్ట్‌లమైపోయాం.

ఒకరోజు బామ్మర్ది శ్రవణ్ ఊరు నుంచి ఊడిపడ్డాడు. ''ఏంటి బావా! ఈరోజు ఆఫీసు లేదా. తొమ్మిదవుతున్నా తీరుబడిగా పేపరు చదువుకుంటున్నావు?'' అని అడిగాడు శ్రవణ్.

''ఆఫీసెందుకు లేదు. ఉంది అదేంటో ఈమధ్య పేపరు గంట గంటన్నర చదివినా 'హెడ్‌లైన్స్' కూడా పూర్తిచెయ్యలేకపోతున్నాను'' అన్నాను.

''అదేంటక్కా! ఆ ఉప్మా ఎంత సేపు చేస్తావు? సుమారు గంట నుండి చేస్తున్నట్లున్నావు?''

''ఏమోరా శ్రవణ్! అన్నింట్లో నిదానంగా వ్యవహరించడం అలవాటైపోయింది'' అంది రాధిక.

''అక్కా! నీళ్లు కాగాయా? నేను స్నానం చేసేస్తాను. చిరాగ్గా ఉంది''

''కాగాయి. వుండు బాత్రూంలో పెట్టేస్తాను'' అంటూ వేణ్ణీళ్ళ బక్కెట్ తీసుకుని రాధిక నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ బాత్రూంలోకి వెళ్తుంటే ''ఆ నడకేంటే! శక్తి నశించినట్లు. ఏమైందని మీ అందరికీ? అఖిల్‌గాడేమో అరగంట నుంచి బ్రష్ చేస్తున్నాడు. వాణ్ణి కదిలిస్తే చాలు రకరకాల ఫేస్ ఫీలింగ్స్‌తో, చేతులూపుతూ, అనవసరంగా నవ్వుతూ విచిత్రంగా బిహేవ్ చేస్తున్నాడు'' అన్నాడు శ్రవణ్.

''మాకేంరా, మేం బాగానే ఉన్నాంగా. నువ్వెళ్లి స్నానం చెయ్యి'' అంది నా శ్రీమతి పేలవంగా నవ్వుతూ.


అలవాటు ప్రకారం రాత్రి ఏడుగంటలకు టీవీ ముందు కూర్చుని వున్న మా నలుగురిని చూసి ''ఏంటి? ఏదైనా ఇంట్రస్టింగ్ ప్రోగ్రాం ఉందా టీవీలో! అందరూ చూస్తున్నారు'' అంటూ శ్రవణ్ వచ్చాడు.

''అబ్బే, కొత్తగా ఏం లేదు శ్రవణ్. రోజూ చూసే సీరియళ్ళు, ప్రోగ్రాంలే. ఒక్కరోజు చూడకపోయినా మా అందరికీ ఏదో వెలితిగా, జీవితంలో ఏదో పోగొట్టుకున్నట్లు ఉంటుంది'' అన్నాను.

''అవున్రా అబ్బాయి! నాకు కళ్ళు సరిగ్గా కనబడకపోయినా సరే ఆ కాసేపు టీవీ ముందుండాల్సిందే. లేకపోతే ఒళ్లంతా నీరసంగా ఉంటుంది'' అంది అమ్మ.

''ఇదేమైనా జబ్బేమో బావా! సైకియాట్రిస్టుని కలవకపోయారా?'' అనడిగాడు శ్రవణ్.

''చాల్లేరా! మాకేదో పిచ్చి పట్టినట్లు మాట్లాడ్తావే. మాకేం ఫరవాలేదు. నువ్వేం దిగులుపడకు.'' అంది నా శ్రీమతి.



ఇంతలో మా అందరికీ ఎం ే ఇష్టమైన 'అంతర్మథనం' సీరియల్ ప్రారంభమై ంది. టైటిల్ సాంగ్ పూర్తవగానే అందులోని హీరో ్స్ 'శోకిని' హృదయవిదారకంగా ఏడుస్తోంది. ీసం ఒక ఇరవై నిముషాలపాటు ఆమె ఏడుపు వివిధ ఏంగిల్స్‌లో ప్రేక్షకులకు చూపించి తన ై ణ్యాన్ని చాటుకున్నాడా కెమెరామెన్.

''బావా! ఏంటిదీ ఆమె ంతసేపలా ఏడుస్తుంది. కథ ముందుకు సాగద అసలింతకీ ఆమెందుకలా ఏడుస్తోంది?'' అంటు ఏకధాటిగా ప్రశ్నల వర్షం కురిపించాడు నా బామ్మ

''అబ్బా! విసిగించక చూ ా బాబూ! అసలు ఏడుపనేది ఒక సముద్రంలా ిది. అది ఎక్కడ మొదలవుతుందో, ఎక్కడ మ ుస్తుందో, మానవ మాత్రులం మనమెలా చెప్ప ం'' అంటూ నా శ్రీమతి గాఢంగా నిట్టూర్చిం

''ఏంటో నీ గోల! నువ్వు ప్పినదాంట్లో ఒక్క ముక్క అర్థమైతే ఒట్టు'' అన్నా శ్రవణ్.

ఇంతలో అడ్వర్టయిజ్‌మెం ్లు మొదలయ్యాయి.

''ఏంటి బావా! ఈ ఎపిసో ఏడుపుతోనే అయిపోయిందా?'' అని అడిగాడు ్రవణ్ ఆశ్చర్యంగా.

''అప్పుడే ఎలా అవుతుంది ఇప్పుడు బ్రేక్ అన్నమాట. మొదట్లో నీకులా కన్ఫ్యూజింగ్‌గా ఉంటుంది. పోనుపోను సీరియ ్ల గురించి నీకర్థమైపోతుందిలే'' అన్నాను మేమీ ి యంలో చాలా తెలివిమీరిపోయాం సుమా అనే ్ం వచ్చేలా. అడ్వర్టయిజ్‌మెంట్లు అయ్యాక ిసోడ్ కంటిన్యూ అయింది. 'శోకిని' మరో ఐదు నిమిషాలపాటు ఏడ్చింది. కాలింగ్‌బెల్ మ్రోగ ంతో 'శోకిని' నెమ్మదిగా కళ్ళు తుడుచుకుంటు గాఢంగా నిట్టూరుస్తూ అడుగులో అడుగేసు ంటూ వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా వున్న శాస్త్రీని పట్టుకుని ''అన్నయ్యా!'' అంటూ మ ఏడవడం మొదలెట్టింది.

''ఏంటక్కా! ఈవిడకి ఏడ ు తప్ప ఇంకేం చాత కాదా?'' అనడిగాడు శ్రవణ్.

''ష్! మాట్లాడక చూడు అంది నా శ్రీమతి.

''ఏంటమ్మా శోకిని! ఎ దుకిలా ఏడుస్తున్నావు?'' అనడిగ ు ఆ శాస్త్రీ.

''అన్నయ్యా! ఏమని ప్పను. ఎలా చెప్పను''

''ఇంతకీ ఏం జరిగిందమ్మా!''

''ఇంకా ఏం జరగాల ్యయ్యా! జరగాల్సిందంతా జరిగిం . ఈ నోటితో ఎలా చెప్పనన్నయ్యా ''

''బాధపడకమ్మా! ష్టాలనేవి మనకు కాకుండా చెట్లకొ ాయా? ఇలాంటప్పుడే మనం ర్యంగా వుండాలి. చూడు ఏడ్చీ ఏడ్చీ ి మొహం ఎలా తయారయ్యిందో! వెళ్ళి మొహం కడుక్కోమ్మా!'' అన్నాడు.

వెంటనే 'రెండువందల నలభై ఆరవై ఎపిసోడ్ వచ్చేవారం' అన్న అక్షరాలు టీవీ స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యాయి.

''ఏంటీ! రెండు వందల నలభై ఆరవ ఎపిసోడా! అప్పు ఏడుపే ఒక ఎపిసోడంతా చూపిస్తే ఇక ఈ సీరియల్ ఇలా సాగకుండా ఎలా ఉంటుంది? అయినా వీటిని మీరెలా ఓపిగ్గా చూస్తున్నారే బాబూ! ఒక్కసారికే కడుపంతా తిప్పినట్లైంది'' అందరినీ తిట్టిపోశాడు శ్రవణ్.

మర్నాడు సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి రాగానే యిల్లంతా గోలగోలగ్గా ఉంది.

''ఏం జరిగింది రాధీ!'' అనడిగాను.

''అది కాదండీ! మరేమో...మరేమో...''

''అలా నాన్చుతావేంటక్కా అసలు విషయం చెప్పకుండా! అఖిల్ ఆరవుతున్నా ఇంకా స్కూలు నుంచి ఇంటికి రాలేదు బావా! నే వెళ్ళి చూసొస్తానంటే ఆగు మీ బావ రానీ అంటూ అక్క ఒకటే గోల'' అన్నాడు.

''మీ అక్క చెప్పింది నిజమే కదా! ఏదైనా నిదానంగా ఆలోచించి చెయ్యాలి'' అన్నాను.

''ఇంకా ఆలోచనలెందుకు బావా! పద స్కూలు కెళ్ళి ఆరాతీస్తే తెలుస్తుంది వాడింకా ఎందుకు రాలేదో'' అన్నాడు.

వెంటనే నా శ్రీమతి ''అబ్బా! నీకేం తెలీదు ఊరుకోరా!'' అని నా వంక తిరిగి ''ఏమండీ! మీరిప్పుడు ఇంట్లోకి, వీధిలోకి ఒక ఐదారుసార్లు పచార్లు చేశారంటే ఏం చెయ్యాలో బోధపడుతుంది'' అంది.

''అవును, రాధీ! నిజమే! మర్చేపోయాను సుమా'' అనుకుంటూ నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ పచార్లు చెయ్యసాగాను.

''ఛీ.ఛీ! ఆ వెధవ సీరియళ్ళు చూడకండే అంటే వినరు. మిమ్మల్నెవరూ బాగుపర్చలేరు'' అంటూ తల బాదుకుని బయటికెళ్ళిపోయాడు శ్రవణ్.

కొద్దిసేపటికి అఖిల్‌ని తీసుకొస్తూ కనిపించాడు శ్రవణ్.

''ఏరా! ఎక్కడ కనిపించాడు వాడు?'' అడిగాను.

''నేను స్కూల్ వైపు వెళ్తుంటే దారిలో ఎదురై కనిపించాడు వాడు, ఎంతడిగినా మరేమో, మరేమో అంటూ నాన్చుతున్నాడు వెధవ'' అన్నాడు కోపంగా.

''మరేమో డాడీ మరేమో! అదీ మా ఫ్రెండ్ పుట్టినరోజు పార్టీకి రమ్మంటేను వెళ్ళాను. ప్రక్క వీధిలో వాళ్ళిల్లు. అక్కడ్నుంచి రావడానికి కనీసం అరగంటైనా పడ్తుందిగా. అందుకే లేటయ్యింది'' అన్నాడు వాడు.

''చూడు బావా! ప్రక్కవీధి నుంచి రావడానికి అరగంట పడ్తుందట. ఈ వయస్సులోనే వీడన్ని అబద్ధాలు చెప్తున్నాడో చూడు'' అన్నాడు శ్రవణ్.

''వాడు చెప్పింది నిజమే కదా శ్రవణ్! అక్కడ్నుంచి రావడానికి మనకే కనీసం ఇరవై నిమిషాలన్నా పడ్తుంది. అలాంటిది వాడు పసివాడు. అరగంట పట్టడంలో అబద్ధమేముంది'' అన్నాన్నేను.

వెంటనే అఖిల్ ఏడుపుముఖం పెట్టి ''ఎంత మాటన్నావు మావయ్యా, నేను...నేను నీ కంటికి 'అబద్ధాలకోరు'లా కనబడుతున్నానా! నిజం చెప్పు మావయ్యా...నిజం చెప్పు. నా కళ్ళలోకి సూటిగా చూసి చెప్పు. చెప్పు మావయ్యా చెప్పు. విధి నాతో ఇలా వింత నాటకమాడుతుందని నేను...నేను కల్లో కూడా అనుకోలేదు మావయ్యా అనుకోలేదు.'' అని నా శ్రీమతి వంక తిరిగి ''అమ్మా! చెప్పకుండా వెళ్ళినందుకు నన్ను క్షమించమ్మా! ఇంకోసారిలా చెయ్యనమ్మా చెయ్యను!'' అంటూ వాడు వెక్కి వెక్కి ఏడ్చాడు.

''ఇంకొక్క క్షణం ఇక్కడుంటే మీ పిచ్చి నాకు పట్టేట్టుంది'' అంటూ లోపలికెళ్ళాడు శ్రవణ్.

''ఏంటో వెధవ సూట్‌కేసు! గంట నుంచి సర్దుతున్నా తెమలడం లేదు. వస్తానక్కా , వెళ్ళొస్తాను బావా, బాయ్ అఖిల్ '' అంటూ వెళ్ళబోయాడు శ్రవణ్.

''ఆగరా! అప్పుడే వెళ్ళిపోతావా? నీకు మేము తప్ప ఇంకెవరున్నారురా?'' అంటూ నా శ్రీమతి ముక్కు చీదింది.

''అంత భారీ డైలాగులేమీ అక్కర్లేదు. నాకింకా ముగ్గురక్కలు, ఇద్దరు తమ్ముళ్ళు, భార్యాబిడ్డలు ఉన్నారు. ముందు మీరంతా ఒక మంచి సైకియాట్రిస్ట్‌ని కలవండి. టీవీ చూడ్డం మానేసాం అంటూ లెటర్ కాదు.. కాదు... టెలిగ్రాం ఇవ్వండి. అప్పుడే నేను మీ ఇంటి గడప త్రొక్కేది, గుడ్‌బై'' అంటూ గబగబా వెళ్ళిపోతున్నాడు, ''కాస్త నెమ్మదిగా వెళ్ళరా'' అంటూ నా శ్రీమతి మెత్తగా మొత్తుకుంటూ ఉండగానే. ★

